# కల్లాల్లో ధాన్యం..కళ్లల్లో దైన్యం

- సర్వేపల్లిలో 20వేల ఎకరాల్లో ఎడగారు సాగు
- వారం రోజులుగా సాగుతున్న వరికోతలు
- తెరుచుకోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- మిల్లర్లతో కుమ్మక్కైన దళారులు
- ధరలు తగ్గించి కొనుగోలు
- వర్షంతో వణుకుతున్న రైతులు
- కల్లాల్లోనే తెగనమ్ముకుంటున్న వైనం


తాటిపర్తిలో పొలం వద్దే ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులు

**పొదలకూరు :** ఎడగారు సాగుచేసిన రైతులు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఈ ఏడాది ఎరువుల కొరతతో పెట్టుబడులు పెరిగాయి. దీనికితోడు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరవక దళారులు ధరలను తగ్గించి ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 20వేల ఎకరాలకుపైగా ఎడగారు సాగు చేపట్టారు. వారం రోజులుగా వరికోతలు ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో మిల్లర్లతో దళారులు కుమ్మక్కై ధరలను తగ్గించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా తగ్గించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న దళారులపై చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాల్సిన అధికారులు సైతం చోద్యం చూస్తున్నారు. పొదలకూరు మండలంలోని పెన్నార్ డెల్టా గ్రామాలైన సూరాయపాళెం, విరువూరు, మహ్మదాపురం, తాటిపర్తి, వెలికంటిపాళెం, నేదురుమల్లి, యర్రబల్లి, తదతర గ్రామాల్లో కేఎన్ఎం 1638, 1010 రకాలను అధికంగా సాగుచేశారు. రైతులు పెట్టిన పెట్టుబడులకు తగిన విధంగా ధాన్యం ధరలు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు వర్ష సూచనలతో అన్నదాతలు వణుకుతున్నారు. కోత దశలోని పంట, కోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు సతమతం అవుతున్నారు. ధాన్యాన్ని ఆరబోసుకుని నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో కల్లాల్లోనే మిల్లర్లు అడిగిన ధరకు తెగనమ్ముకుంటున్నారు. వారం క్రితం కేఎన్ఎం రకం ధాన్యాన్ని పుట్టి రూ.16,500కు కొనుగోలు చేశారు. ప్రస్తుతం 1010 రకాన్ని పుట్టి రూ.13 వేలు, కేఎన్ఎం 1638 రకాన్ని పుట్టి రూ.15,500 వంతున కొనుగోలు చేస్తున్నారు. కోతలు ముమ్మరంగా సాగుతుండడం.. వర్షాలు పడుతుండంతో దాదాపు పుట్టిపై రూ.1000 తగ్గించి దళారులు కొనుగోలు చేస్తున్నారు.

**పెరిగిన పెట్టుబడులు**

సాధారణంగా ఎడగారు ధాన్యం దిగుబడులు తగ్గుతాయి. అయితే ఈ ఏడాది దిగుబడి ఆశించిన స్థాయిలో ఉన్నాయి. తాటిపర్తి, మహ్మదాపురం, తదితర గ్రామాల్లో రబీ సీజన్‌లో మాదిరిగా ఎడగారులో సైతం నాలుగు పుట్ల వరకు ధాన్యం దిగుబడి వచ్చినట్లుగా రైతులు వెల్లడించారు. అయితే ధాన్యానికి మద్దతు ధరలు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఎడగారులో ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడులు అయ్యాయని, ప్రస్తుత ధరల ప్రకారం కష్టం కూడా గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కొనుగోలు కేంద్రాలెక్కడ?**

సాధారణంగా ప్రభుత్వం ఎడగారు నూర్పిళ్లకు ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరుస్తుంది. అయితే ఈ ఏడాది ఎక్కడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో దళారులు, మిల్లర్లు కుమ్మక్కై ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో మద్దతు ధరలు దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**దిగుబడులు వచ్చినా ఫలితం లేదు**



ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఎడగారులో ధాన్యం ఆశించిన దానికంటే అధికంగా దిగుబడి వచ్చింది. అయితే దళారులు ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో రైతులకు లాభం లేకుండాపోయింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరిచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– కే.రమణారెడ్డి, రైతు, మహ్మదాపురం.

**కొనుగోలు కేంద్రాలు తెరవ లేదు**



ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవలేదు. అయితే రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు కృషి చేస్తున్నా. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిశీలించి పరిష్కరిస్తాం.

– వీ ప్రతాప్, ఏఓ, పొదలకూరు.

## అన్నదాతను ముంచిన అకాల వర్షం

**కొడవలూరు:** ధాన్యం ధరల్లేక విలవిల్లాడుతున్న అన్నదాతను అకాల వర్షం నిలువునా ముంచింది. ప్రస్తుతం ఎడగారు వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు ధాన్యాన్ని రోడ్ల వెంబడి ఆరబోసుకుంటున్నారు. రెండ్రోజులుగా ఉదయం ఎండ కాస్తూ మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తుండడంతో అన్నదాతలు ఆరబోసుకున్న ధాన్యాన్ని పట్టలతో కప్పి పెట్టుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు ఇదే అదనుగా భావించి దళారులు రైతులను దోచుకుంటున్నారు. ఎడగారు కోతల ప్రారంభంలో పుట్టి ధర రూ.17 వేలు ఉండగా, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడం, వర్షాన్ని అదనుగా తీసుకుని ధరలను అమాంతం తగ్గించేశారు. పుట్టి కేవలం రూ.15,500కే కొనుగోలు చేస్తున్నారు. వర్షంలో ధాన్యాన్ని కాపాడుకోలేని రైతులు తెగనమ్ముకుంటున్నారు. ధాన్యం దళారుల పంట పండిస్తుండగా, రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతూ లబోదిబోమంటున్నారు. దళారులు మద్దతు ధర కన్నా తగ్గించి కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నా జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు నోరు మెదపకపోవడం, జిల్లా అధికార యంత్రాంగం పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.


పాతవంగల్లులో వర్షం పడుతుండడంతో ధాన్యాన్ని కప్పిపెడుతున్న రైతు

## క్లుప్తంగా

### వ్యక్తి అదృశ్యం

**నెల్లూరు(క్రైమ్):** మానసికంగా బాధపడుతున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. డైకస్ రోడ్డు కుండల దర్గావీధిలో షేక్ షంషాద్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె రెండో కుమారుడు సమీర్ ఏసీ కూరగాయల మార్కెట్లో పని చేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో పదేళ్ల క్రితం భార్య అతడిని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పట్నుంచి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతున్నాడు. ఈ నెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమీర్ అదృశ్యమయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించి జాడ తెలియకపోవడంతో శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### యూరియా పంపిణీపై యాక్షన్ ప్లాన్

- కలెక్టర్ హిమాన్షు శుక్లా

**నెల్లూరు రూరల్:** మండలాల వారీగా రైతుల యూరియా అవసరాలను గుర్తించి అందుకనుగుణంగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో వ్యవసాయ,ఉద్యాన, పశుసంవర్ధక, మైక్రో ఇరిగేషన్, సహకార, ప్రకృతి వ్యవసాయం, మత్స్య శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతుకు నిర్ణీత కార్డులను అందజేసి యూరియా పంపిణీ వివరాలను నమోదు చేయాలన్నారు. యంత్రాల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపేలా మరింత కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, జిల్లా హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి, డీసీఓ గుర్రప్ప, మత్స్యశాఖ జేడీ శాంతి, పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

### వ్యాధుల నియంత్రణకు చర్యలు

**నెల్లూరు(అర్బన్):** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ సుజాత వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని కిసాన్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న రాజీవ్‌గాంధీ కాలనీలో మలేరియా కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మతో కలిసి డీఎంహెచ్ఓ శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. లార్వా, ఫీవర్ సర్వే, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలన్నారు. దోమల వల్లే డెంగీ, మలేరియా తదితర జబ్బులు వస్తాయన్నారు. ప్రజలు అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకునేలా వైద్యసిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. నిల్వ ఉన్న నీటి గుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని, అలాగే దోమల లార్వాలను తినే గంబూసియా చేపలను వదలాలని తెలిపారు. కిసాన్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీల్‌బాబు, సహాయ మలేరియా నివారణ అధికారి నాగార్జునరావు, శాంసన్‌బాబు పాల్గొన్నారు.

### అథ్లెటిక్స్ పోటీలు వాయిదా

**నెల్లూరు(టౌన్):** స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జరగాల్సిన అథ్లెటిక్స్ పోటీలను వర్షం కారణంగా వాయిదా వేస్తున్నట్లు డీవీఈఓ కృష్ణారెడ్డి, ఎస్జీఎఫ్ అండర్ - 19 జిల్లా సెక్రటరీ పాటూరు వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో పోటీల తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు.

### పదిరోజులపాటు గుజరాత్ యాత్ర

**నెల్లూరు సిటీ:** వచ్చే నెల 7వ తేదీ నుంచి 10 రోజులపాటు ప్రత్యేక పర్యాటక రైలు ద్వారా భవ్య గుజరాత్ యాత్రను నిర్వహించనున్నట్లు తిరుపతి ఏరియా మేనేజర్ కె.వేణుగోపాల్, విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. నెల్లూరు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వివిధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక స్థలాలను దర్శించే అవకాశం యాత్రికులకు కలుగుతుందన్నారు. రైలు రేణిగుంట నుంచి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, ఖాజీపేట, సికింద్రాబాద్, నిజాముద్దీన్, హుజూర్ సాహెబ్ నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి అదే మార్గం లో రేణిగుంట చేరుతుందన్నారు. వివరాలకు ఐఆర్‌సీటీసీ టూరిజం వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

### త్రీఫేజ్ విద్యుత్ అందించడమే లక్ష్యం

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఉన్న గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ అందించడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తోందని చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్) రమణాదేవి అన్నారు. శుక్రవారం ఆమె జిల్లాకు వచ్చారు. గ్రామాల్లో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం రూరల్ డివిజన్ పరిధిలోని పొట్టేపాళెం, దేవరపాళెం, కొమ్మరపూడి, సిద్ధీపురం ప్రాంతాల్లో పర్యటించి పనులను పరిశీలించారు. అదేవిధంగా నగరంలో ఏర్పాటు చేయనున్న కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రూ.400 కోట్లతో విద్యుత్ మౌలిక వసతుల పనులు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా 139 సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేట్ కార్యాలయ ఈఈ రాజేంద్రప్రసాద్, ఈఈలు పరంధామయ్య, భానుప్రకాష్, శ్రీధర్, లక్ష్మీనారాయణ, రమేష్ చౌదరి, బెనర్జీ, సోమశేఖర్‌రెడ్డి, డీఈఈలు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మండల స్థాయి స్కూల్‌గేమ్స్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్ఎం అమూల్య

**మనుబోలు:** మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న 69వ మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు పోటీలను హైస్కూల్ హెచ్ఎం అమూల్య ప్రారంభించారు. అండర్-17 వాలీబాల్ పోటీల్లో బాలుర విభాగంలో మనుబోలు, బాలికల విభాగంలో మడమనూరు జట్లు విజయం సాధించాయి. అలాగే అండర్-14 వాలీబాల్ పోటీల్లో బాలుర విభాగంలో వీరంపల్లి జట్టు, బాలికల విభాగంలో మడమనూరు జట్టు విజయం సాధించాయి. అండర్-17 ఖోఖో పోటీల్లోలో బాలుర విభాగంలో వీరంపల్లిజట్టు, బాలికల విభాగంలో అక్కంపేట జట్టు విజయం సాధించాయి. అండర్-14 కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో వీరంపల్లి జట్టు, బాలికల విభాగంలో మడమనూరు జట్టు విజయం సాధించాయి. విజేతలను డివిజన్ స్థాయి పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఏపీజీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


పొదుపు మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

**మనుబోలు:** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ ఓఎస్డీ అరుణ్‌కుమార్, జనరల్ మేనేజర్ రామకృష్ణ కోరారు. మండలంలోని బద్దెవోలులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో విశాలమైన నూతన భవనంలో కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. రైతులు, స్వయం సహాయక సంఘాలు, చిన్నవ్యాపారులు, స్వయం ఉపాధి పొందేవారు బ్యాంకు అందిస్తున్న రుణసేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఏడు స్వయం సహాయక సంఘాలకు రూ.1.09 కోట్ల రుణం మంజూరు చేశారు. ఆర్ఎం మోహన్‌రెడ్డి, చీఫ్‌మేనేజర్ ఆంజనేయులు, సీనియర్ మేనేజర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కడుపు కొడుతున్న కూటమి ప్రభుత్వం


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు నరసింహ

**కొడవలూరు:** కూటమి ప్రభుత్వం రైతుల కడుపు కొడుతోందని సీఐటీయూ మండల కార్యదర్శి తలారి నరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. నార్తురాజుపాళెంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర రూ.20,200 ప్రకటించిందని తెలిపారు. రాష్ట్రంలో దళారులు రూ.15,500కు కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ధాన్యానికి మద్దతు ధరలు లేక రైతులు అల్లాడుతున్నా జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కొనుగోలు కేంద్రాలను తెరిచి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దళారులు అడిగిన ధరకు అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు గోనె దయాకర్ మాట్లాడుతూ జిల్లాలో ఇద్దరు సీనియర్ మంత్రులు ఉండి కూడా రైతుల పక్షాన గళం విప్పకపోవడం దారుణమన్నారు. రైతుల ఉసురు పోసుకుంటున్న కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి మహబూబ్‌బాషా, సీఐటీయూ మండలాధ్యక్షుడు నన్నం సురేష్, సీపీఎం నాయకుడు వీ దేవానంద్ పాల్గొన్నారు.

## కారు అద్దాలు పగలగొట్టి చోరీ

**నెల్లూరు(క్రైమ్):** కారు అద్దాలు పగలగొట్టి నగదు, ల్యాప్‌టాప్ తదితరాలను గుర్తుతెలియని దుండగులు అపహరించారు. వివరాలు.. ఏఎస్‌పేట మండలానికి చెందిన కీర్తి తన పిల్లలకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో గురువారం తన కారులో పొగతోటలోని ఓ హాస్పిటల్‌కు తీసుకొచ్చింది. డాక్టర్ వద్ద పిల్లల్ని చూపించి రాత్రి మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న బాటా షోరూమ్‌కు వచ్చారు. కారును షోరూమ్ ఎదుట పార్క్ చేసి లోనికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు కారు కుడివైపు వెనుక డోర్ అద్దాలు పగలగొట్టి లోపల ఉన్న రెండు ల్యాప్‌టాప్‌లు, పాస్‌పోర్టు, హ్యాండ్‌బ్యాగ్, ఫోన్, కాలి వెండిపట్టీలు, రూ.15 వేల నగదును దోచుకెళ్లారు. బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. శుక్రవారం షోరూమ్ పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలించారు.

### నేడు గ్రీన్ ఏపీ ర్యాలీ

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** నగర పంచాయతీ పరిధిలోని 14వ వార్డులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఏపీ పేరిట శనివారం ర్యాలీ నిర్వహించనున్నట్లు కమిషనర్ బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి హరివిల్లు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. పట్టణ ప్రజలు పాల్గొనాలని కోరారు.

### కోళ్ల వ్యర్థాల వాహనాల పట్టివేత

**పొదలకూరు :** తమిళనాడు నుంచి కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఐదు వాహనాలను మండలంలోని బిరదవోలు గ్రామం వద్ద పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. వాహనాల డ్రైవర్లు నాగరాజు, వెంకటేశ్వర్లుతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. చేపలకు మేతగా వేసేందుకు తరలిస్తున్న కోళ్ల వ్యర్థాలను అటవీప్రాంతంలో గుంట తీసి తవ్వి పూడ్చిపెట్టారు. డ్రైవర్లతో పాటు వాహనాల యజమానులపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై హనీఫ్ తెలిపారు.

### దౌర్జన్యంపై కేసు నమోదు

**పొదలకూరు :** మండలంలోని బత్తులపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డిపై అదే గ్రామానికి చెందిన తండ్రికుమారుడు సుందరామిరెడ్డి, హజరత్‌రెడ్డి దౌర్జన్యానికి పాల్పడడంతో ఎస్సై హనీఫ్ శుక్రవారం కేసు నమోదు చేశారు. పొలం విషయంలో దౌర్జన్యానికి పాల్పడడంతో నిందితులపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై వెల్లడించారు.

### ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలి

**పొదలకూరు :** గ్రీన్‌అంబాసిడర్లు ట్రైసైకిళ్ల ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని నెల్లూరు డీఎల్‌పీఓ రమణయ్య అన్నారు. మండలంలోని ఆర్‌వైపాళెంలో ఇంటింటి చెత్త సేకరణను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రానికి తరలించాలని సూచించారు. తడి చెత్తను వర్మికంపోస్టుగా మార్చి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీ ఆదాయాన్ని పెంచాలన్నారు.

### వేడుకగా చిత్రకూట ఉత్సవం

**నెల్లూరు(బృందావనం):** రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో శుక్రవారం చిత్రకూట ఉత్సవం వేడుకగా జరిగింది. ఆలయ తూర్పు రాజగోపురం నిర్మాణ కైంకర్యపరులు ఎరగుడిపాటి వెంకటాచలం పంతులు జయంతి సందర్భంగా చిత్రకూట ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. దేవస్థానం నుంచి స్వామి ఉభయదేవేరులతో కలిసి చిత్రకూటం వద్దకు తరలివచ్చారు. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రవళిక

**వెంకటాచలం:** పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రవళిక అన్నారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా తిక్కవరప్పాడు పంచాయతీ మల్లిగుంటసంఘంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, పోషకాహార లోపంతో వచ్చే వ్యాధులు, ఎన్సీడీ వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాలు, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**కొడవలూరు:** స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మండలంలోని పెమ్మారెడ్డిపాళెంలో యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గండవరం ఆయుర్వేద వైద్యాధికారిణి ఎన్ గీత మాట్లాడుతూ మహిళలకు కేన్సర్, రక్తహీనత, మధుమేహం, బీపీ, తదితర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏమైనా సందేహాలుంటే వెంటనే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కామాక్షయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆలూరుపాడులో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి ఎం రామకృష్ణ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు, సమాజం బాగుంటాయన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య సమస్యలపై ఏమైనా సందేహాలుంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్ఓ టీ సోమశేఖర్, హెచ్ఎస్ వీ రామ్మోహన్, హెచ్ఏ ఎస్కే షఫీఉద్దీన్, ఏఎన్ఎం నదియ తదితరులు పాల్గొన్నారు.


పొదలకూరు: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీకావ్య

**పొదలకూరు :** మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీకావ్య అన్నారు. మండలంలోని వావింటపర్తిలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకావ్య మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


కొడవలూరు: ఆలూరుపాడులో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రామకృష్ణ


కొడవలూరు మండలం పెమ్మారెడ్డిపాళెంలో..

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


బీచ్‌లోని చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

**ఇందుకూరుపేట :** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని నెల్లూరు డిప్యూటీ డీఈఓ ఎస్వీ నాయక్ అన్నారు. మైపాడు బీచ్‌లో భారత ప్రభుత్వం భూవిజ్ఞాన శాఖ ఆధ్వర్యంలో సముద్ర తీరాల సంరక్షణ-మన బాధ్యత అనే నినాదంతో కోస్టల్ క్లీనప్ వీక్-2025 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొని బీచ్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ ప్రకృతి మనకు ఇచ్చిన వరం సముద్రమని, దాన్ని కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులే ముందుండాలని సూచించారు. నెల్లూరు, ఇందుకూరుపేట ఎంఈఓలు మురళీధర్, సునీల్ మాట్లాడుతూ సముద్ర తీరాన్ని శుభ్రం చేసేందుకు ముందుకొచ్చిన స్కౌట్స్ విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గంగపట్నం, నరసాపురం ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు చలపతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### ఆసిఫాతాజీంకు డాక్టరేట్



**వెంకటాచలం:** విక్రమ సింహపురి యూనివర్శిటీ నుంచి పరిశోధక విద్యార్థి ఆసిఫా తాజీం డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆమె బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ జే విజేత పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ సోషల్ మీడియా మార్కెటింగ్ ఆన్ ఎలక్ట్రానిక్ గూడ్స్ కన్స్యూమర్స్' అనే అంశంపై పరిశోధనలు సాగించి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఈ మేరకు ఆసిఫా తాజీంకు వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసులు శుక్రవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసి అభినందించారు.

### రీసర్వేపై గ్రామసభ


మాట్లాడుతున్న డీటీ

**ముత్తుకూరు(పొదలకూరు) :** ముత్తుకూరు మండలంలోని నేలటూరు, ముత్తుకూరు, పంటపాళెం గ్రామాల్లో రీసర్వే గ్రామసభలను శుక్రవారం నిర్వహించారు. ముత్తుకూరు గ్రామసభలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ జషీర్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మండల సర్వేయర్ మస్తాన్, సచివాలయ సర్వేయర్ అబిద్, వీఆర్వోలు స్పందన, పోలయ్య, రైతులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్ కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి కొత్తగా తీసుకొచ్చిన ఓటీపీ నిబంధనతో నిరక్షరాస్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో నిరసన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.